క్లుప్తంగా

శాకాంబరిగా సరస్వతీ మాత



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దంపతులు సత్యనారాయణ స్వామి మండపంలో సమూహిక వ్రతాలు ఆచరించారు. ఆలయంలో కొలువైన సరస్వతీ మాతను పూజారులు వివిధ కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఆంజనేయ శర్మ, ఈఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ తదితరులు ఉన్నారు.

గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు



వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌ను శనివారం అధికారులు ప్రారంభించారు. రుణమాఫీకి సంబంధించిన రైతుల సందేహాలను ఈ సెల్ ద్వారా నివృత్తి చేస్తామని మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ పేర్కొన్నారు. రైతులు తమ వెంట ఆధార్‌కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి సాయి తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటిని తరలిస్తాం



పరిశీలిస్తున్న జితేందర్‌గౌడ్

రామాయంపేట (మెదక్): పట్టణంలోని పాత పెట్రోల్ బంకు వెనుకభాగంలో ఇళ్ల మధ్య నిలిచిన వరద నీటిని శనివారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కమిషనర్ దేవరాజ్ పరిశీలించారు. మురుగునీటిని తరలించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. సమస్యను పరిష్కరించడానికి కృషిచేస్తానని, ఈలోగా కాలువ తీసి మురుగునీటిని ఇక్కడి నుంచి తరలిస్తామని చైర్మన్ చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, నాయకులు చంద్రపు కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి

పెద్దశంకరంపేట(మెదక్): పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని మండల నోడల్ అధికారి వెంకటేశం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. విద్యార్థులకు ఉచితవిద్య, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు తెలపాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): పంటల వివరాల నమోదుకు రైతులు సహకరించాలని ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, దివ్యశ్రీ తెలిపారు. మండలంలోని రాయిలాపూర్, దేవులపల్లి గ్రామాలలో శనివారం వారు పంటలసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వానకాలంలో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు సహకరించి పూర్తి వివరాలను తెలియజేయాలని కోరారు. మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు స్ప్రే చేయవద్దని సూచించారు.

మెహందీ.. భలే గిరాకీ

- ఆషాఢంలో మహిళలకు మక్కువ
- మైదాకుతో ఉపాధి పొందుతున్న కూలీలు
- పల్లెల్లో పోగుచేసి పట్టణంలో విక్రయం
- రోజుకు రూ.4వేల ఆదాయం

ఆషాఢ మాసంలో మెహందీపై మహిళలు ఎక్కువ మక్కువ చూపుతారు. పట్టణం, పల్లె తేడా లేకుండా మహిళలు, చిన్నారులు సహితం పెట్టుకోవడానికి ఇష్టపడతారు. డిమాండ్ బాగా ఉండడంతో కొందరు దానినే ఉపాధిగా చేసుకుంటున్నారు. గ్రామాలలో ఉచితంగా దొరుకుతున్న గోరింటాకును పేస్టుగా తయారుచేసి హైదరాబాద్‌లో అమ్ముతుంటారు. ఆకుతోపాటు, పేస్టును అమ్ముతూ రోజుకు రూ.4వేలు సంపాదిస్తున్నారు. పేస్టు రూపంలో రెడీమేడ్‌గా అందుబాటులో ఉండడంతో కొనడానికి చాలా మంది ముందుకు వస్తున్నారు.

– అల్లాదుర్గం(మెదక్)


అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన నడిపోళ్ల అనిత, వీరేశం భార్యభర్తలు. వారు హైదరాబాద్‌లో కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఆషాఢమాసంలో మహిళలు మెహందీ పెట్టుకోవడం ఆనవాయితీ. దీంతో అనిత గ్రామం నుంచి గోరింటాకును తీసుకొచ్చి దానిని పేస్టుగా తయారు చేసి హైదరాబాద్‌లో రూ.50కు చెటాక్ అమ్మడంతో జనం ఎగబడి కొంటున్నారు. పేస్టుతోపాటు ఆకును కూడా అమ్మడంతో రోజుకు నాలుగు వేల రూపాయలు సంపాదిస్తున్నామని చెబుతున్నారు. ఆషాఢ మాసంలో దీని ద్వారా ఉపాధి పొందుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు.



హైదరాబాద్‌లో మైదాకు అమ్ముతున్న అనిత



గోరింటాకు కోస్తున్న అనిత, వీరేశం



గోరింటాకు పేస్ట్

పేస్టుగా తయారుచేసి..



ఆషాఢంలో మహిళలు మెహందీ అంటే చాలా ఇష్టపడతారు. మొదటి రోజు కొంత గోరింటాకును తీసుకువెళ్లి అమ్మగా ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. గోరింటాకులో చక్కెర, పెరుగు, నిమ్మరసం, చింతపండు కలిపి పేస్టుచేసిన మైదాకు పెట్టుకుంటే ఎర్రగా పండుతుంది. ఈ పేస్టును చెటాక్ రూ.60 చొప్పున విక్రయించగా మహిళలు బాగా కొనుగోలు చేశారు. దీంతో ప్రతిరోజు గ్రామం నుంచి ఆకును తీసుకువెళ్లి సాయంత్రం రద్దీ ఉన్న సెంటర్లలో అమ్ముకుంటున్నాం.

– అనిత, బహిరన్‌దిబ్బ, అల్లాదుర్గం

ఉపాధి కల్పించిన మైదాక్



హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాను. నా భార్యకు మైదాకు తీసుకెళ్లి అమ్మే ఆలోచన వచ్చింది. దీంతో అటవీ ప్రాంతంలో మధ్యాహ్నం వరకు మైదాకు కోసి ఆటోలో హైదరాబాద్ తీసుకెళ్తున్నాం. ఆకుతోపాటు, పేస్టు చేసి అమ్మడంతో ఈ నెలలో మాకు ఆదాయం బాగావస్తుంది.

– వీరేశం, బహిరన్‌దిబ్బ, అల్లాదుర్గం

అంగన్‌వాడీ ద్వారా ఉత్తమ సేవలు

- మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



నర్సాపూర్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మంచి సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సీడీపీఓ హేమభార్గవి, సూపర్‌వైజర్లు సరళ కుమారి, సంతోష, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ పిలుపునిచ్చారు. అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ద్వారా చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యనేర్పడంతోపాటు పౌష్టికాహారం ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోషిమాత, ఎంపీఓ శరత్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

గుంతలతో ప్రమాదాలు



గుంతలో పడిన బర్రె

చిన్నశంకరంపేట(మెదక్): ఫైబర్ కేబుల్స్ వేసేందుకు నెల రోజుల క్రితం తవ్వివదిలేసిన గుంతలో బర్రె పడిపోయిన ఘటన మండలంలోని మడూర్‌లో చోటుచేసుకుంది. శనివారం మడూర్ గ్రామ శివారులోని గజగట్లపల్లి రోడ్డు పక్కన తవ్విన గుంతలో ప్రమాదవశాత్తు ఓ బర్రె పడిపోయిందని గమనించిన రైతులు దానిని అతికష్టం మీద బయటకు తీశారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన తవ్విన గుంతలను పూడ్చివేయాలని వారు కోరారు.

ఏడుపాయల్లో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): గురుపౌర్ణమి సందర్భంగా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం వద్ద ఉన్న యాగశాలలో శనివారం సూర్యాపేట జిల్లా మెళ్లచెరువుకు చెందిన రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదివారం కూడా పూజలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తా..

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్రంలోని ఎస్టీల అభివృద్ధికి కృషిచేస్తానని రాష్ట్ర ఎరుకలి సంఘం ఉపాధ్యక్షుడు నర్సింహ చెప్పారు. శనివారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చిన సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. స్థానిక నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి, బీఆర్ఎస్ నేత మహేశ్, రవి, గోపాల్, ఎల్లేశ్, గిరిధర్, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేశం, రాజు, మోహిన్, ఇర్ఫాన్, అన్వర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి



శశిధర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): బీసీ జనగణన చేపట్టి స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్లోల శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బీసీ జనగణన చేపట్టి 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి బీసీ రిజర్వేషన్ అమలు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.లక్షకోట్ల నిధులు కేటాయిస్తామన్న హామీని కూడా నిలబెట్టుకోవాలని కోరారు.

రైతులను మోసగించిన ప్రభుత్వం

- బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): రుణమాఫీ విషయమై ప్రభుత్వం రైతులను మోసగించిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు భానుచందర్, ప్రధాన కార్యదర్శి అవినాశ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్ శనివారం రామాయంపేటలో మాట్లాడారు. కొందరికి మాత్రమే రూ.లక్ష మాఫీ చేశారని, చాలామందికి రుణమాఫీ కాలేదని ఆరోపించారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామన్న ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. భరత్, అనిల్, కృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మల్లుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు ఇమ్మడి నరేశ్ నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. శనివారం నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించిడంతోపాటు నోట్‌బుక్స్, పెన్నులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎ మాధవి, నరేశ్‌గౌడ్, శ్రీహరి, మెట్టు గణేశ్, శంకరయ్య, నారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

‘ఆధార్’ ఇచ్చేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



వివరాలు అందజేస్తున్న నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని మగ్దుంపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న బేతాని సంరక్షణ నిలయంలోని అనాథలకు ఆధార్ కార్డులు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గత నెలలో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘అనాథలకు ఆధార్ ఏదీ’ అనే కథనానికి నర్సాపూర్ కోర్టు న్యాయమూర్తి అనిత స్పందించి సంబంధిత అధికారులకు సూచించారు. దీంతో స్థానిక ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా ఆదేశాలతో జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. 26న బేతాని సంరక్షణ నిలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి ఆధార్ కార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. సమస్య పరిష్కారం అవుతుండడంతో సంరక్షణ డైరెక్టర్ ఫాదర్ సజీవ్ వర్గీస్ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది సిస్టర్ కార్‌మాల్, విన్సెంట్, వీరబాబు తదితరులు ఉన్నారు.

జోరుగావాన..



కౌడిపల్లిలో కురుస్తున్న వాన

కౌడిపల్లి(నర్సాపూర్)/రామాయంపేట(మెదక్)/పెద్దశంకరంపేట(మెదక్)/నర్సాపూర్/పాపన్నపేట(మెదక్): వివిధ మండలాల్లో శనివారం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జూన్, జూలై నెలల్లో సరైన వర్షం కురవలేదని దీంతో బోరుబావులలో సైతం నీరు తగ్గిందని పలువురు రైతులు వాపోయారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షం పత్తి, మొక్కజొన్న, జొన్న ఇతర పంటలకు ప్రాణం పోస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. నర్సాపూర్ మండలంలో ఎనిమిది మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ కమలాద్రి చెప్పారు.

రోడ్డుపై కూలిన చెట్టు

రామాయంపేట(మెదక్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్థానిక టీచర్స్ కాలనీవద్ద శనివారం భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా నేలకూలింది. ఈ ఘటనలో ఏ ప్రమాదం జరుగకపోయినా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు, మున్సిపల్‌శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం

రుణమాఫీపై రైతుల సంబరాలు



వెల్దుర్తి(తూప్రాన్): క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించడంతో మండలంలోని చెర్లపల్లిలో రైతులు, కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మొదటి విడత రుణమాఫీ నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పెంటారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధిరాంరెడ్డి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో..

రామాయంపేట(మెదక్): రైతు రుణమాఫీ ప్రకటించిన దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సామ్యానాయక్, సురేశ్‌నాయక్, యాదగిరి, మహిళా రైతులు పాల్గొన్నారు.

రోజూ పాఠశాలకు వచ్చేలా చూడండి

- ప్రిన్సిపాల్ శ్రీదేవి



చిన్నశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో మోడల్‌స్కూల్ విద్యార్థుల తల్లితండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు వచ్చేవిధంగా చూడాలన్నారు. బస్ రాలేదనే సాకుతో విద్యార్థులు గైర్హాజరవుతున్నారని, అలాంటప్పుడు విద్యార్థులను స్వయంగా తల్లితండ్రులు పాఠశాలకు తీసుకురావాలని కోరారు. పాఠశాల అనంతరం ఇంటికి వచ్చిన విద్యార్థులను ఇంటి వద్ద చదువుకోవడంతో పాటు హోంవర్క్ పూర్తిచేసేలా చూడాలన్నారు.

బడికి పంపాలి..

శివ్వంపేట(నర్సాపూర్): తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని మండల పరిధి దొంతి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రవి కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి విద్యార్థులు ఇంటికి వచ్చాక ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉంచి హోంవర్క్ పూర్తి చేయడంతోపాటు చదువుకునేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. 10వ తరగతిలో 10జీపీఏ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్, గౌరీశంకర్, నాగేశ్వర్‌రావు, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థిపై తల్లిదండ్రులు ఇంటి వద్ద ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం నర్సింగం చెప్పారు. కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యాకమిటీ చైర్మన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు సహకరించాలి

చేగుంట(తూప్రాన్): పాఠశాల అభివృద్ధి కోసం తల్లిదండ్రులు సహకరించాలని వడియారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధిరాములు అన్నారు. ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు ప్రియదర్శిని, వసంత, సంతోషిమాత తదితరులు పాల్గొన్నారు.

178 మందికి వైద్య పరీక్షలు



మందులను అందజేస్తున్న వైద్యులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కరీంనగర్ గ్రామంలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి ఆస్పత్రి వైద్య బృందం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. 178 మందికి పరీక్షలు నిర్వహించగా 38మందికి శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉందని, వారిని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి ఆపరేషన్‌లు చేయించనున్నట్లు లయన్స్ అధ్యక్షుడు బుర్క నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు హరికృష్ణ, వంశీకృష్ణ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, లయన్స్ ప్రతినిధులు రామచంద్రం, సతీశ్, నాగేశ్వర్, సుఖేందర్ పీఆర్వోలు రవి, సాయి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆయన తన క్యాంపు కార్యాలయంలో శనివారం బాధితులకు ఎల్‌ఓసీ అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీలతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. మాసాయిపేటకు చెందిన విజయకు వైద్యం అందించేందుకు వీలుగా రెండు లక్షల రూపాయల ఎల్‌ఓసీని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ ఉపాధ్యాయులకు వీడ్కోలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పోతాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న రామారావు, సంతోష్, సుజాత, రేణుక, వసంతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాగారెడ్డి, మాజీ సర్పంచ్ సంతోష సిద్దిరెడ్డి, బాలసాయిహరిప్రసాద్ పాల్గొన్నారు.

◆ ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని మండల నాయకుడు శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలని, మంత్రి పదవి ఇవ్వాలని, చేప పిల్లలను పంపిణీ చేయాలని కోరారు. నరేశ్, మల్లేశ్, నాగభూషణం, గిరిధర్, భిక్షపతి, సత్యనారాయణ, రాజు, నర్సింహులు, నాగరాజు, సుధాకర్, ప్రేమ్ తదితరులున్నారు.

◆ సివిల్ కేసు రాజీ

మెదక్‌జోన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి లక్ష్మీ శారద అధ్యక్షతన శనివారం కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో 150 ఎకరాలకు సివిల్ కేసును రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

◆ రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలి

కౌడిపల్లి(నర్సాపూర్): కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కు వచ్చిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వప్న తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతుబీమా లేనివారు రైతు పేరుమీద భూమి ఉండి కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కు వచ్చినట్లయితే ఆగష్టు 1వ తేదిలోపు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

30 వరకు అవకాశం

టేక్మాల్(మెదక్): రైతుబీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పుల సవరణకు ఈనెల 30 వరకు అవకాశం ఉందని చెప్పారు.

◆ కొనసాగుతున్న దీక్షలు

నర్సాపూర్: సంగారెడ్డి రీచ్–2 కాలువకు తమ భూములు ఇవ్వబోమని స్థానిక చౌరస్తాలో రైతులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం 9వ రోజుకు చేరాయి. తమ భూములు తీసుకోవాలంటే భూమికి భూమి ఇవ్వాలని లేనిపక్షంలో ఎకరానికి 60 నుంచి 70లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తూ రిలే నిరహార దీక్షలు చేస్తున్నారు. దీక్షలలో చిన్నచింతకుంట గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, హన్మంతుగౌడ్, పెంటయ్య, అంజాగౌడ్ కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ గురుకులం ప్రిన్సిపాల్ బదిలీ

నర్సాపూర్: నర్సాపూర్‌లోని గిరిజన గురుకులం ప్రిన్సిపాల్ బదిలీ అయ్యారు. అల్లూరి సీతారామ రాజు గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షమయ్య బదిలీపై మునుగోడుకు వెళ్లగా ఆయన స్థానంలో కొడంగల్ నుంచి బల్‌రాం నాయక్ వచ్చి శనివారం బాధ్యతలు స్వీకరించారు.

◆ వైభవంగా విఠలేశ్వర రథయాత్ర

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని రుక్మిణీ విఠలేశ్వరాలయ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆషాఢమాసం సందర్భంగా ప్రతియేటా ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా శనివారం ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు.

◆ గురుపౌర్ణమి పాదయాత్ర

పాపన్నపేట(మెదక్): రంగంపేటలో ఆదివారం జరుగనున్న గురుపౌర్ణమి వేడుకల కోసం శనివారం నాగ్‌సాన్‌పల్లి నుంచి పాదయాత్రగా బ్రాహ్మణులు తరలి వెళ్లారు. మాధవ నంద సరస్వతి ఆధ్వర్యంలో వేడుకలు జరుగనున్నాయి. దత్తాత్రేయ ఆలయం నుంచి జనార్దన్ శర్మ తదితరులు వెళ్లనున్నారు.

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణిమను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.